పశువులకు వేసవి గండం

- పాల దిగుబడిపై ప్రభావం
- పరిశుభ్రమైన వాతావరణం, నీరు అవసరం
- పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలి
- ఏడీఏ డాక్టర్ నాగరాజు సూచనలు



డోన్: వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మనుషులతో పాటు పశువులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. భానుడి ప్రతాపానికి మూగ జీవాలు విలవిల్లాడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు పలు రకాల అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. రైతులు వ్యవసాయం తరువాత చాలా గ్రామాల్లో పాడి పరిశ్రమకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. రోజు రోజుకు ఎండ తీవ్రత అధికం అవుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వేసవి ముగిసే వరకు పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఏడీఏ నాగరాజు సూచిస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా చూసుకోవాలి

పశువులను మేత కోసం అడవులు, పచ్చిక బయళ్లకు తోలుకెళ్తుంటారు. అయితే వేసవిలో ఇలా చేయడం వల్ల పశువులు అధిక వేడిని తట్టుకోలేక వడదెబ్బ భారిన పడతాయి. ఎక్కువ సమయం ఎండలో ఆహారం కోసం తిరగడం, తాగునీరు పూర్తిస్థాయిలో లభించకపోవడం వల్ల పశువులు వడదెబ్బ భారిన పడతాయి. పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరగడం ద్వారా శ్వాస, నాడి, వేగం పెరిగి చమట ఎక్కువ కారుతుంది. కొన్ని సందర్భాల్లో పశువులు అపస్మారక స్థితికి చేరుకుని చనిపోయే ప్రమాదం ఉంది.

నంద్యాల జిల్లాలో జీవాల వివరాలు	
ఆవులు	120536
బర్రెలు	293071
గొర్రెలు	882914
మేకలు	305830

పశువుల్లో ఈ లక్షణాలు కనిపిస్తే వడదెబ్బ తగిలిందని గుర్తించాలి. తగినంత నీరు తాపించడంతో పాటు పశువులను శుభ్రమైన నీటితో కడగాల్సి ఉంటుంది. చల్లని ప్రదేశాల్లో లేదా షెడ్లలో పశువులను ఉంచాల్సి ఉంటుంది. ఉష్ణోగ్రతలను అదుపు చేసేందుకు వీలుగా పాకల చుట్టూ తడిపిన గోనె సంచులను కట్టాలి. ప్రతి రోజు వీలైనంత వరకు పచ్చిగడ్డి అందించాలి. అధిక ఉష్ణోగ్రతకు గురయ్యే పశువులు తల, శరీర భాగాలను నీటితో తడపాలి. ఉష్ణతాపానికి గురయ్యే బర్రెల ద్వారా 20 శాతం పాల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఉదయం 6 నుంచి 10 గంటలకు వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మాత్రమే పశువులను మేత కోసం బయటకు తీసుకెళ్లడం ఉత్తమం.

వ్యాధి నిరోధక శక్తి తగ్గే అవకాశం

సామాన్యంగా వేసవిలో పశువులకు కావాల్సినంత మేత దొరకదు. పౌష్టికాహారం లభించక వ్యాధినిరోధక శక్తి గణనీయంగా తగ్గిపోతుంది. దీని కారణంగా గొంతువాపు, గాలికుంటు, జబ్బువాపు వంటి అనేక రకాల అంటు రోగాలు ప్రభలే ప్రమాదం ఉంది. మేతకు వెళ్లినప్పుడు కుంటల్లో నిలిచిన కలుషిత నీరు తాగడం, పశువులను ఆ నీటితో శుభ్రం చేయడం ద్వారా అంతర్ బాహ్య పరాన్నజీవుల సమస్యలు కూడా తలెత్తుతాయి. ఇవన్నీ గమనించి వేసవికి ముందే పాడిరైతులు పశువులకు టీకాలు వేయించాలి. నట్టల నివారణ మందులు తాపించాలి. సమతుల్యమైన పోషకాహారాన్ని అందించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



సహజంగా వేసవిలో పశువులు నీరు ఎక్కువగా తీసుకుని ఆహారం తక్కువగా తీసుకుంటాయి. కాబట్టి పశువులకు వీలైనంత వరకు పరిశుభ్రమైన నీటినే తాగించాలి. ఆహారం విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. గడ్డి, దానాకు సంబంధించి రాత్రిపూట ఎండుగడ్డిని మాత్రం పశువులకు ఇవ్వాలి. పశువుల చుట్టూ పరిశుభ్ర వాతావరణంతో పాటు చల్లని వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

–డాక్టర్ నాగరాజు, ఏడీఏ

క్లుప్తంగా

కోవెలకుంట్ల విద్యార్థికి అత్యుత్తమ మార్కులు



ఉసేన్‌బాషా

కోవెలకుంట్ల: పదో తరగతి ఫలితాల్లో కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఉసేన్ బాషా సత్తాచాటాడు. 600 మార్కులకు 589 మార్కులు సాధించాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా కోవెలకుంట్ల పాఠశాల విద్యార్థి అత్యధిక మార్కులు సాధించడంపై హెచ్‌ఎం రాజయ్య హర్షం వ్యక్తం చేశారు. హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వధూవరులకు ఆశీర్వాదం

బనగానపల్లె: మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సిద్దయ్య వివాహం బనగానపల్లె సమీపంలో ఉన్న ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, పాపసాని గోపాల్ రెడ్డి, బొబ్బల చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, కొట్టాల మధు తదితరులు ఉన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో పోలికి వర చిదంబరస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం అభిషేకం, షోడశోపచార పూజలు, పారాయణం, గురుపూజ తదితర కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం పల్లకోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. భక్తులకు అన్నదానం చేశారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రయాణికులకు మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు. సత్యసాయిబాబా వర్ధంతిని పురస్కరించుకుని వీటిని అందజేసినట్లు సమితి సభ్యుడు రాంశంకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రంగారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, జగదీశ్వరరెడ్డి, కృష్ణుడు, సత్యనారాయణ, సూరి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఆ సంఘం పట్టణ, మండల అధ్యక్షులు గుండా గోపాలు, జనార్దన్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు సుధీర్ బాటసారులు, వాహనదారులకు నీటితో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. సమాజానికి సేవచేయడంతోనే మానవ జన్మకు సార్ధకత చేకూరుతుందని ఆర్యవైశ్య యువజన సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు బొగ్గరపు ధనుంజయ పేర్కొన్నారు.

ఎంపీపీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



రాజశేఖర్ రెడ్డిని పరామర్శిస్తున్న కాటసాని రామిరెడ్డి

అవుకు: స్థానిక ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి కొద్ది రోజుల క్రితం నంద్యాలలోని ఉదయానంద ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గురువారం ఆస్పత్రికి వెళ్లి ఎంపీపీని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు అవుకు ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఉన్నారు.

టపాసుల గోడౌన్ తనిఖీ



యాజమానితో మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభారాణి

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న వెంకటసుబ్బయ్యకు చెందిన టాపాసుల గోడౌన్‌ను బనగానపల్లె అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభారాణి, ఆర్ఐ ప్రవీణ్‌నాయక్, ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ ఈశ్వర్ నాయక్ గురవారం ఆకస్మిక తనిఖీ చేశారు. లైసెన్స్‌తో పాటు నిబంధనల మేరకు గోడౌన్ నిర్వహిస్తున్నారా? ప్రమాణాలు, జాగ్రత్తలు తీసుకుంటున్నారా? బాల కార్మికులు పనిచేస్తున్నారా తదితర వివరాలు ఆరా తీశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



సిల్వర్ మెడల్‌తో మధు హేమంత్

కొలిమిగుండ్ల: ఏలూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్స్ విభిన్న ప్రతిభావంతుల పోటీల్లో కొలిమిగుండ్లకు చెందిన విద్యార్థి మధు హేమంత్ ప్రతిభ చాటారని ఐఈఆర్టీ నూర్‌బాషా తెలిపారు. 26 జిల్లాల నుంచి విభిన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను ఈపోటీలకు ఎంపిక చేశారన్నారు. నంద్యాల జిల్లా నుంచి ఆరుగురు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కొలిమిగుండ్ల భవిత కేంద్రానికి చెందిన మధు హేమంత్ అండర్–14 విభాగంలో వంద మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారని చెప్పారు. తగినంత ప్రోత్సాహం, అవకాశాలు, సూచనలు ఇస్తే విభిన్న ప్రతిభావంతులైన పిల్లలు కూడ క్రీడల్లో రాణిస్తారని అన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

బనగానపల్లె రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సీనియర్ సైంటిస్ట్, ప్రధాన అధికారి ధనలక్ష్మి అన్నారు. గురువారం యాగంటిపల్లె కేవీకేలో పీఎం ప్రణామ్ పథకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. రైతులు రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలన్నారు. శాస్త్రవేత్తలు రమణయ్య, బాలరాజు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే విజయం



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: ప్రణాళికలకు అనుగుణంగా చదివితేనే విజయం సాధించగలరని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో పలువురు అవుకు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గురువారం స్థానిక చల్లా కార్యాలయంలో విద్యార్థులు, ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వం ఉండాలన్నారు. ఎలాంటి ఫలితాలు వచ్చినా కుంగిపోవాల్సిన అవసరం లేదని, మానసికంగా ధృడంగా ఉన్నామంటే మరెన్నో విజయాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు, హెచ్‌ఎంలు శింగయ్య, చెన్నకేశ్వరి, భాస్కర్, ప్రిన్సిపాల్ బాబు పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం



వేలంపాట నిబంధనలు తెలియజేస్తున్న ఎస్‌ఐ

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్లలో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయ భూములకు గురువారం కౌలు వేలం పాట నిర్వహించారు. 40 ఎకరాల మాన్యం భూమిని ఈ ఏడాది రూ. 4.93 లక్షలకు కౌలు చెల్లించేలా రైతులు వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రేవనూరు ఎస్‌ఐ భూపాలుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

న్యాయమూర్తికి సన్మానం



జడ్జి అబ్దుల్‌రహిమాన్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల నెల్లూరుకు బదిలీ అయిన జడ్జి అబ్దుల్ రహిమాన్‌ను గురువారం బనగానపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ..తనకు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అందరూ సమానమే అన్నారు. పలువురు బార్ అసోసియేషన్ న్యాయవాదులు జడ్జితో తమకున్న అనుబంధం, ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజాహుస్సేన్, సెక్రటరీ శ్రీనివాసమూర్తి, న్యాయవాదులు అబ్దుల్ ఖైర్, యూసఫ్, మాధవరెడ్డి, పరశురామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బాబావలి, అల్లావుద్దీన్, జాకీర్ హుస్సేన్, ముజాహీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



బనగానపల్లె: మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ప్యాపిలి/బనగానపల్లె రూరల్/కోవెలకుంట్ల/బేతంచెర్ల: బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో మహాత్మగాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఎంపీడీఓలు మాట్లాడుతూ..స్థానిక పాలనా వ్యవహారలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీరాజ్ సంస్థల పాత్ర కీలకమన్నారు. 1993 ఏప్రిల్ 24 నుంచి పంచాయతీ రాజ్ వ్యవస్థ అమల్లోకి వచ్చిందన్నారు. అనంతరం పంచాయతీ రాజ్‌లో ఉత్తమ సేవలను అందించిన ఉద్యోగులను ఎంపీడీఓలు ఘనంగా సన్మానించారు. కోవెలకుంట్లలో మండల పంచాయతీరాజ్ ఇంజినీర్ చెంచయ్య, సీనియర్ అసిస్టెంట్ రామసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శులు సురేంద్రనాథరెడ్డి, మల్లేశ్వరి, జ్యోతిని సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ప్యాపిలి, కోవెలకుంట్ల, బేతంచెర్ల ఎంపీడీఓలు శ్రీనివాసులు, వరప్రసాదరావు, ఫజుల్ రహిమాన్, పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్‌నాయుడు, బనగానపల్లె ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ హమీద్, బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ దరఖాస్తుకు అవకాశం

కొలిమిగుండ్ల: పింఛన్ తీసుకునే భర్త ఏదైనా కారణంతో మృతి చెందినట్లయితే వారి భార్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి గురువారం తెలిపారు. 2023 డిసెంబర్ 1వ తేదీ నుంచి 2024 అక్టోబర్ 31 తేదీ మధ్య కాలంలో భర్త మరణించిన వారి భార్య మాత్రమే దరఖాస్తుకు అర్హురాలని చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు భర్త డెత్ సర్టిఫికెట్, భార్య,భర్త ఆధార్ కార్డు జెరాక్స్, పింఛన్ బుక్, రేషన్ కార్డు జెరాక్స్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమాధుల నిర్మాణంతో ఇబ్బందులు



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

డోన్: పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో నిర్మిస్తున్న సమాధుల కారణంగానే ఇబ్బందులు తలెత్తుతున్నాయని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్ అన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో గురువారం మున్సిపల్ డీఈ ప్రసాద్‌తో కలిసి శ్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ శ్మశాన వాటిక 1.92 ఎకరాల్లో, వైశ్యుల శ్మశాన వాటిక 1.12 ఎకరాల్లో ఉన్నాయన్నారు. స్థలం చాలా తక్కువగా ఉండడంతో శవాలను పూడ్చడానికి ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో కొందరు సమాధులు నిర్మించడం ద్వారా స్థల సమస్య వస్తోందని చెప్పారు. ప్రజలు సహృదయంతో అర్థం చేసుకుని సమాధులు నిర్మించకుండా సహకరించాలని కోరారు. శ్మశానవాటికలో గుంత తీసేందుకుగతంలోమాదిరే మున్సిపాలిటీకి రూ.1000 చెల్లిస్తే ఆ బాధ్యత మున్సిపాలిటీ తీసుకునేలా కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించి తెలియజేస్తామన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామంలో ఈనెల 15వ తేదీ జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను రంగాపురం గ్రామంలో అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటగిరి మధు సురేంద్ర ఇంటికి తాళాలు వేసి ఈ నెల 14వ తేదీ ఊరికి వెళ్లారు. 15వ తేదీ ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగుల గొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 3.50 తులాల బంగారు నగలు అపహరించినట్లు గుర్తించాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డోన్ కొత్తపేటకు చెందిన కలింగిరి సురేంద్ర కుమార్, రెడ్డి పోగు వికాస్ బేతంచెర్ల మండలం రంగాపురం గ్రామంలో గురువారం అనుమానాస్పదంగా పోలీసులు తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి నుంచి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. కొంత కాలంగా వీరిద్దరూ జల్సాలకు అలవాటు పడి తాళం వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తెలిసిందన్నారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్యాపిలి: పదో తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఏటీఎల్ గంగాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా డోన్‌లోని ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీస్‌లో దరఖాస్తు అందజేయాలన్నారు. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు 2, పదో తరగతి మార్కుల జిరాక్స్ కాపీ, హాల్ టికెట్ జిరాక్స్, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ జిరాక్స్, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు నేరుగా దరఖాస్తు అందజేయాలన్నారు. మే 11న పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇంటర్‌లో ఉచిత విద్య అందిస్తామని పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: విజయవాడలోని కీట్స్ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతీయువకులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్, జావా స్క్రిప్ట్, పైథాన్, వెబ్ డిజైనింగ్ కోర్సుల్లో 6 నెలల పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో శిక్షణ ఇస్తామని ఆ సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 30 ఏళ్ల నిండి డిగ్రీ ఆపై విద్యార్హత ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబరును సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

డోన్ రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ బిందుమాధవి తెలిపారు. స్టేషన్‌లోని 3వ నంబర్ ప్లాట్‌ఫాంపై వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారని చెప్పారు. అక్కడి వెళ్లి పరిశీలించామని.. మృతుని వయస్సు 50 నుంచి 55 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతుడు పిస్తా కలర్ ఫుల్ షర్ట్, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడని.. ఎత్తు 5.5 అడుగులు, రంగు చామచాయగా ఉన్నాడని వెల్లడించారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు డోన్ రైల్వే స్టేషన్‌లోని పోలీసులను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచామన్నారు.

గడ్డివామి దగ్ధం

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. పుట్టా రామకృష్ణయ్యకు చెందిన గడ్డివామికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. సమాచారం అందుకున్న డోన్ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. అయితే అప్పటికే గడ్డివామి కాలిపోవడంతో రూ. 30 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఉక్కపోతతో విలవిల



ప్లాట్‌ఫామ్‌ల వద్ద తిరగని ఫ్యాన్లు

మండుటెండలతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే భానుడు విశ్వరూపం చూపుతున్నాడు. వారం రోజుల నుంచి ఎండతీవ్రతతోపాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఉక్కపోత కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండలంతో పాటు సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, అవుకు మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పనుల నిమిత్తం ఆర్టీసీ బస్సుల ద్వారా ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వస్తుంటారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప, తిరుపతి, దొర్నిపాడు మీదుగా ఆళ్లగడ్డకు వెళ్లే ప్లాట్‌ఫామ్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్యాన్లు కొద్ది రోజుల నుంచి పని చేయడం లేదు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఫ్యాన్లు తిరగకపోవడంతో గాలి తగలక అవస్థలు పడుతున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండతీవ్రత అధికంగా ఉండడంతో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలకు ఉక్కపోత సమస్య తప్పడం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఫ్యాన్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకరావాలని ప్రయాణికులు కోరుతున్నారు. –కోవెలకుంట్ల

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి



బేతంచెర్లలో హిందూ పరిరక్షణ వేదిక సభ్యుల ర్యాలీ



ప్యాపిలిలో నిరసన ర్యాలీ

బనగానపల్లె: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో విహార యాత్రికులపై జరిగిన ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అన్నారు. గురువారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దాడి మనదేశ ఐక్యత, సమగ్రతను దెబ్బతీసే విధంగా ఉందన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, నాయకులు వెంకటకృష్ణుడు, సుబ్బరాయుడు, గోవిందనాయక్, పోలియనాయక్ పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ: బేతంచెర్ల: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి దారుణమని హిందూ పరిరక్షణ వేదిక సభ్యులు గూని నాగరాజు, నాగమోహన్, రామ్మూర్తి అన్నారు. దాడిని నిరసిస్తూ గురువారం హిందూ పరిరక్షణ వేదిక, ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో బేతంచెర్లలోని అమ్మవారిశాల, అంగళ్ల బజారు, మెయిన్ బజారు, పాత బస్టాండ్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద మానవహారంగా నిలబడి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. భారతీయులందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మారుతి శర్మ, మధుమోహన్‌రెడ్డి, డక్కి శేఖర్, నరసింహులు, ధర్మారెడ్డి, హరి, రమణ, రవిశంకర్ పాల్గొన్నారు.

ముష్కరులను మట్టుబెట్టాల్సిందే

ప్యాపిలి: పహల్గాంలో పర్యాటకులను అతి కిరాతకంగా హతమార్చిన ముష్కరులను మట్టుబెట్టాల్సిందేనని హిందూ పరిక్షణ వేదిక సభ్యులు రామాంజనేయులు, ఎల్లప్ప, నరేశ్, రామ్మోహన్ అన్నారు. పట్టణంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అమాయకులను చంపడం పిరికిపందల చర్య అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి గురై బెస్త గౌతమ బుద్ధుడు గాయపడ్డాడు. విద్యుత్ స్తంభాన్ని ఎక్కి రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో గాయపడిన అతన్ని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యువకుడి అదృశ్యం



మహమ్మద్ జిలాని (ఫైల్)

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి గురువారం తెలిపారు. కోవెలకుంట్లకు చెందిన మహమ్మద్ జిలాని గౌండా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు, బజాజ్ ఫైనాన్స్ ద్వారా లోన్లు తీసుకున్నాడు. బ్యాంకు సిబ్బంది డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో 20 రోజుల నుంచి కనిపించడం లేదు. సెల్ ఫోన్ ఇంట్లోనే పెట్టి వెళ్లడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం సాయంత్రం భార్య మహమ్మద్‌చాంద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

కోవెలుకుంట్ల: కోవెలకుంట్ల–అవుకు ఆర్‌అండ్‌బీ రహదారిలోని ముదిగేడు సర్కిల్‌లో గురువారం సాయంత్రం ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలు ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్ తదితర రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు.